'రాగిజావ'తో సంపూర్ణ పోషణ

- గోరుముద్దలో మార్పులు
- వచ్చే నెల 2 నుంచి అమలు

మామిడికుదురు: ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటున్న ప్రతి విద్యార్థికి సంపూర్ణ పోషకాహారం అందించాలన్న దృఢ సంకల్పంతో ప్రభుత్వం ముందుకు వెళ్తోంది. దీనిలో భాగంగా మధ్యాహ్న భోజన పథకంలో భాగంగా విద్యార్థులకు అందిస్తున్న జగనన్న గోరుముద్ద పథకంలో మార్పులకు నాంది పలికింది. ఈ పథకంలో ప్రస్తుతం అందిస్తున్న మెనూలో వచ్చే నెల 2వ తేదీ నుంచి విద్యార్థులకు రాగిజావ అందించాలని నిర్ణయించింది. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న పేద, మధ్య తరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థులకు ఉచిత విద్యతో పాటుగా గోరుముద్ద పథకంలో సంపూర్ణ పోషకాహారం అందిస్తున్నారు. ప్రస్తుతం అమలు చేస్తున్న మెనూకు అదనంగా ×రాగిజావ₹ కూడా అందించనున్నారు. వచ్చే నెల నుంచి విద్యార్థులకు మూడు రోజులు అనగా మంగళ, గురు, శని వారాల్లో రాగిజావ అందించాలని ప్రభుత్వం ఆదేశించింది. దీని కోసం ప్రతి పాఠశాలకు ప్రభుత్వమే నేరుగా రాగిపిండి, బెల్లం సరఫరా చేస్తుంది. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వచ్చే నెలలో దీన్ని లాంఛనంగా ప్రారంభించనున్నారు.

ప్రస్తుత గోరుముద్ద మెనూ వివరాలు..
సోమవారం: వెజ్ పలావు, గుడ్డు కూర, చిక్కీ
మంగళవారం: పులిహోర, దొండకాయ చట్నీ, గుడ్డు
బుధవారం: వెజ్ బిర్యానీ, బంగాళదుంప కూర, గుడ్డు, చిక్కీ,
గురువారం: లెమన్ రైస్, టమాటా చట్నీ, గుడ్డు
శుక్రవారం: పప్పు ఆకుకూర, అన్నం, గుడ్డు, చిక్కీ
శనివారం: ఆకుకూరతో తయారుచేసిన అన్నం, స్వీట్ పొంగల్

వచ్చే నెల నుంచి ప్రస్తుతం అమలు చేస్తున్న మెనూతో పాటుగా మూడు రోజులు రాగిజావ అందించే విధంగా కార్యాచరణ రూపొందించారు.

మూడు నియోజకవర్గాల్లో అమలు తీరిది...
పి.గన్నవరం, కొత్తపేట, రాజోలు నియోజకవర్గాల పరిధిలోని 11 మండలాల్లో 539 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. వాటిలో 39,838 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. రోజుకు సుమారుగా 34,550 మంది విద్యార్థులు జగనన్న గోరుముద్దలో భాగంగా స్కూళ్లలో భోజనం చేస్తున్నారు. ప్రస్తుతం అమలు చేస్తున్న మెనూకు అదనంగా వచ్చే నెల నుంచి పైన పేర్కొన్న విద్యార్థులకు రాగిజావ అందించనున్నారు.


పాశర్లపూడి స్కూల్‌లో మధ్యాహ్న భోజనం చేస్తున్న విద్యార్థులు

మండలం	పాఠశాలలు	విద్యార్థులు	భోజనం చేస్తున్న విద్యార్థులు
అయినవిల్లి	71	5,243	4,513
అంబాజీపేట	64	4,127	3,493
పి.గన్నవరం	83	5,976	5,048
మామిడికుదురు	72	4,690	4,071
ఆత్రేయపురం	54	4,267	3,704
అలమూరు	49	4,806	3,800
కొత్తపేట	83	5,777	5,190
రావులపాలెం	54	5,316	4,567
రాజోలు	68	4,723	4,259
మల్కిపురం	78	5,360	4,650
సఖినేటిపల్లి	81	4,899	4,309
మొత్తం	539	39,838	34,550

రాగి జావ అందించేందుకు చర్యలు



మధ్యాహ్న భోజనం పథకంలో రాగి జావ అందించేందుకు ప్రభుత్వం కార్యాచరణ చేపట్టింది. వచ్చే నెల 2వ తేదీ నుంచి దీన్ని అమలు చేసేందుకు కార్యాచరణ చేపట్టాం. విద్యార్థులకు రాగిజావ అందించేందుకు ప్రతి పాఠశాలకు రాగిపిండి, బెల్లం ప్రభుత్వమే సరఫరా చేస్తుంది. మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులు రాగిజావని తయారు చేసి విద్యార్థులకు వడ్డించవలసి ఉంది.

– కోన హెలీనా, ఎంఈఓ, పి.గన్నవరం

పోషకాలు పుష్కలం



రాగి పిండిలో కాల్షియం ఎక్కువగా ఉంటుంది. కాల్షియం ఎముకల దృఢత్వానికి ఎంతో ఉపయోగపడుతుంది. వెరుశనగ, నువ్వులు, ఆకుకూరలు, గుడ్డుతో పాటుగా రాగి పిండిలో ఐరెన్ కంటెంట్ ఉంటుంది. ఇవి విద్యార్థులకు ఎంతోగానో శక్తిని, బలాన్నిస్తాయి. పిల్లల్లో ఎదుగుదల ఉపయోగపడుతుంది. రక్తహీనత నివారిస్తుంది. వేసవిలో రాగిజావ ఎక్కువ చల్లదనాన్ని ఇస్తుంది.

– కె.స్వర్ణలత, పీహెచ్‌సీ వైద్యాధికారి, నగరం

క్లుప్తంగా

పొలంబడిలో సస్యరక్షణ సూచనలు

మలికిపురం: మండలంలోని విశ్వేశ్వరాయపురంలో బుధవారం పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. రైతుభరోసా మరియు, మండల వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కలుపు నివారణ, ఎరువుల యాజమాన్యం తదితర అంశాల్లో రైతులకు అవగాహన కల్పించారు. తెగుళ్ల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఓ ఎస్.రాకేష్, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ నల్లి శివకుమార్, దొరబాబు, థెరిస్సా, శ్రీరామ్, వేణు తదితరులు పాల్గొన్నారు.

విద్యాఫలాలు అందరికీ పంచాలి


శేషప్రసాద్‌కు జ్ఞాపిక అందిస్తున్న అధ్యాపకులు

మలికిపురం: విద్యార్థులు తాము నేర్చుకున్న విద్యాఫలాలను అందరికీ పంచాలని లక్కవరం మంగెన గురయ్య కళాశాల విశ్రాంత తెలుగు పండిట్ పెద్దింటి శేషప్రసాద్ ఆచార్యులు పేర్కొన్నారు. బుధవారం కళాశాలలో విద్యార్థుల వీడ్కోలు సభ జరిగింది. కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. విద్యాదానం చాలా గొప్పదని ఆయన కొనియాడారు. విద్యార్థులు, అధ్యాపకులు ఆయనకు జ్ఞాపికలు అందించారు. ఏబీ నాయుడు, కె.రాంబాబు, వై.శివాజీ, ప్రభాకర్, దుర్గారావు రాజేష్ శివన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఎఫ్‌పీఎస్ సేవలను విస్తృతం చేయాలి

ఆలమూరు: మండలంలోని పెదపళ్ల పీహెచ్‌సీ పరిధిలో ఫ్యామిలీ ఫిజీషియన్ సేవలను విస్తృతం చేయడంతో పాటు ప్రసవాల సంఖ్యను పెంచాలని వైద్యాధికారి పి.భవానీశంకర్ అన్నారు. స్థానిక పీహెచ్‌సీలో బుధవారం వైద్యారోగ్య సిబ్బందికి సెక్టార్ సమావేశం జరిగింది. జనవరి నెలలో సాధించిన ప్రగతిని అధికారులకు ఆరోగ్య సిబ్బంది వివరించారు. అనంతరం సబ్‌సెంటర్ల వారీగా వైద్యాధికారులు రికార్డులను తనిఖీ చేసి పలు సూచనలు, సలహాలు అందజేశారు. సీహెచ్‌ఓ పి.వెంకటరత్నం, హెల్త్ ఎడ్యుకేటర్ ఏవీవీ రాజా సూపర్‌వైజర్లు పీవీ రమణారావు, పి.ఉమ పాల్గొన్నారు.

భూసారం పెంపొందించాలి

మలికిపురం: భూసారం పెంపొందించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ప్రకృతి వ్యవసాయ విభాగం లక్కవరం యూనిట్ ఇన్‌చార్జి పి.ఆదినారాయణ పేర్కొన్నారు. ఏపీ ప్రకృతి వ్యవసాయ విభాగం ఆధ్వర్యంలో లక్కవరంలో జరిగిన ర్యాలీలో పాఠశాల విద్యార్థులు పాల్గొని నినాదాలు చేశారు. వచ్చే వేసవిలో పచ్చిరొట్ట వేసి వరి చేలలో భూసారం పెంచాలని ఆదినారాయణ సూచించారు. తద్వారా దిగుబడులు పెరిగి రైతులకు ఆదాయం బాగుంటుందని అన్నారు. నాణ్యమైన ఆహార ఉత్పత్తులకు రైతులు ప్రాధాన్యమివ్వాలని సూచించారు. అందుకు ప్రకృతి వ్యవసాయ విభాగం అన్ని విధాలుగా సాయపడుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు రాపాక సుమలత, సమాఖ్య మహిళలు, రైతులు పాల్గొన్నారు.

పంట పొలాల్లోకి దూసుకెళ్లిన కారు

అంబాజీపేట: ముక్కామల–ఈదరపల్లి ప్రధాన రహదారిలో బుధవారం ఓ కారు అదుపుతప్పి పంట పొలాల్లోకి దూసుకెళ్లింది. స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ముక్కామల నుంచి అమలాపురం వైపు వెళుతున్న ఐటెన్ కారు ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి అదుపుతప్పి పక్కనే ఉన్న పంట పొలాల్లోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో ఎవరికి ఎటువంటి ప్రమాదం జరగకపోవడంతో స్థానికులు, ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు.

సేవాదృక్పథంతో వైద్య సేవలు


మామిడికుదురులో వైనతేయం నాయుడు దంపతులను సత్కరిస్తున్న డాక్టర్లు

మామిడికుదురు: ప్రజలకు సేవ అందించాలన్న దృక్పథంతో డాక్టర్ వడ్డే వైనతేయం నాయుడు 52 ఏళ్లుగా ప్రజలకు వైద్య సేవలందించి వారి మన్ననలు అందుకున్నారని ప్రముఖ డాక్టర్లు త్సవటపల్లి సత్యనారాయణ మూర్తి, బసవా వరహాలు పేర్కొన్నారు. అయిదు దశాబ్దాల పాటు మామిడికుదురు పరిసర గ్రామాల ప్రజలకు వైద్య సేవలందిస్తున్న వైనతేయం నాయుడుకు స్థానికులు బుధవారం పౌర సన్మానం ఏర్పాటు చేశారు. ఈ సభకు రిటైర్డ్ హెచ్‌ఎం యెరుబండి లక్ష్మయ్య అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సత్యనారాయణమూర్తి, వరహాలు మాట్లాడుతూ మానవ సేవే మాధవ సేవగా భావించిన వైనతేయం నాయుడు ఎంతో మందికి వైద్య సేవలందిస్తున్నారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా వైనతేయం నాయుడు దంపతులకు పుష్పగుచ్ఛాలు అందించి వారిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో డాక్టర్లు కె.సీతా రామారావు, కడలి సత్యనారాయణ, బోణం నాగేశ్వరరావు, జెడ్పీటీసీ కశిరెడ్డి ఆంజనేయులు, వలవల బాబ్జి పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహం పరిశీలన


వుడయార్ శిల్పశాలలో ప్రభుత్వ సలహాదారు జూపూడి

కొత్తపేట: ప్రకాశం జిల్లా కొత్తపట్నం మండలం జూపూడి సమీప సంపువారిగుంట గ్రామంలో నెలకొల్పనున్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కాంస్య విగ్రహం పరిశీలనకు రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు జూపూడి ప్రభాకరరావు విచ్చేశారు. బుధవారం సాయంత్రం ఆయన కొత్తపేటలో ప్రముఖ జాతీయ శిల్పి డి.రాజ్‌కుమార్‌వుడయార్ శిల్పశాలకు వచ్చి విగ్రహాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా జూపూడి మాట్లాడుతూ తన స్వగ్రామం సంపువారిగుంటలో 9 అడుగుల అంబేడ్కర్ కాంస్యవిగ్రహం నెలకొల్పనున్నట్టు తెలిపారు. ఆయన వెంట పార్టీ దళిత నాయకుడు గొల్లపల్లి డేవిడ్‌రాజు, జాతీయ మాల మహానాడు అధ్యక్షుడు ఎంఏకే భీమారావు తదితర నాయకులు ఉన్నారు.

విద్యార్థి గుండె శస్త్రచికిత్సకు ఆర్థిక సాయం

రావులపాలెం: మండలంలోని ఊబలంకకి చెందిన గార్లపాటి పృథ్వీరాజ్ స్థానిక ఎస్‌వీజీ కాన్వెంట్‌లో ఏడో తరగతి చదువుతున్నాడు. గత కొంతకాలంగా గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్నాడు. వైద్యులు గుండెమార్పిడి శస్త్రచికిత్స చేయాల్సి ఉంటుందన్నారు. దీనికి రూ.30 లక్షల వరకూ ఖర్చు అవుతుందని పృథ్వీరాజ్ తల్లిదండ్రులు సాయం కోసం ఎదురు చూస్తున్నారు. విషయం తెలుసుకున్న ఎస్‌వీజీ కాన్వెంట్ యాజమాన్యం, ఉపాధ్యాయులు, విద్యార్థులతో సంయుక్తంగా సమకూర్చిన రూ.87,735 నగదును బుధవారం విద్యార్థి తండ్రికి అందజేశారు.

బీసీల పక్షపాతి సీఎం జగన్


మాచవరంలో విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చిట్టిబాబు

అంబాజీపేట: రాష్ట్ర చరిత్రలో ఇంత వరకూ చేయని విధంగా శాసన మండలికి అత్యధిక శాతం బీసీలను పంపించడం ద్వారా విప్లవం తీసుకువచ్చి బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాల పక్షపాతిగా నిలిచారని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. మాచవరంలో టీటీడీ ధర్మ ప్రచార పరిషత్ కో ఆప్షన్ సభ్యుడు పీకే రావు కొబ్బరి గొడౌన్ వద్ద విలేకరుల సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ స్థానిక సంస్థలు, ఎమ్మెల్యే, గవర్నర్ కోటాలో మొత్తం 18 మంది ఎమ్మెల్సీ అభ్యర్థులను ప్రకటించగా సామాన్యులైన శెట్టిబలిజ, దండోరా సామాజిక వర్గాలకు చెందిన కుడుపూడి సూర్యనారాయణరావు, బొమ్మి ఇజ్రాయిల్‌కు ఇవ్వడం ద్వారా సీఎం జగన్ తన నిబద్ధత చాటుకున్నారన్నారు. పార్టీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి శెట్టిబలిజ వర్గానికి చెందిన పిల్లి సుభాష్ చంద్రబోస్‌ను పెద్దల సభకు పంపారని, అలాగే చెల్లుబోయిన శ్రీనివాసవేణుగోపాలకృష్ణకు మంత్రి వర్గంలో చోటు కల్పించడమే కాకుండా స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ బీసీలకే అవకాశాలు ఇచ్చారన్నారు. టీడీపీ బీసీలే బ్యాక్‌బోన్ అంటూ మాయ మాటలు చెప్పి కేవలం ఓటు బ్యాంకు రాజకీయాలకే వారిని వాడుకుని వదిలేశారన్నారు. సమావేశంలో ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ పేరి శ్రీనివాస్, మార్కెట్ కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్ వేటుకూరి వెంకట్రాజు, నాగవరపు నాగరాజు, జేసీఎస్ మండల కన్వీనర్ దొమ్మేటి సత్యమోహన్, ఎంపీటీసీల మండల అధ్యక్షుడు ముత్తాబత్తుల ప్రశాంత్, తోలేటి బంగారు నాయుడు, మట్టపర్తి బాలాజీ, నందెపు సూరిబాబు, మైలా ఆనందరావు పాల్గొన్నారు.

సంక్షేమాన్ని ప్రజలకు వివరించండి
పి.గన్నవరం: సీఎం జగన్ సారథ్యంలో ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాల్సిన బాధ్యత పార్టీ శ్రేణులపై ఉందని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు పేర్కొన్నారు. మండలంలోని కుందాలపల్లి, నరేంద్రపురం, రాజులపాలెం, పోతవరం గ్రామాల్లో బుధవారం జరిగిన సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, పార్టీ శ్రేణులతో నిర్వహించిన సమావేశానికి జేసీఎస్ ఇన్‌చార్జ్ దొమ్మేటి దుర్గారావు అధ్యక్షత వహించారు. ఎమ్మెల్యే చిట్టిబాబు మాట్లాడుతూ ఎన్నికల్లో అనుసరించాల్సిన విధివిధానాలపై పార్టీ శ్రేణులకు దిశా నిర్దేశం చేశారు. ప్రతి ఇంటి తలుపు తట్టి ప్రభుత్వం ద్వారా అందుతున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. ఈ కార్యక్రమాన్ని విస్తృతంగా చేపట్టాలని సూచించారు. సమావేశంలో పార్టీ మండల శాఖ అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వరరావు, మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు తోలేటి బంగారునాయుడు, పార్టీ నేతలు పప్పుల రామారావు, కాట్రు వెంకటేశ్వరరావు, జల్లి పండు, కోట నాగేంద్రప్రసాద్, ఉచ్చుల సత్యనారాయణ, కొంబత్తుల ఏసు, నక్కా గోపి, గుత్తుల మధు పాల్గొన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచాలి

అంబాజీపేట: వాతావరణ మార్పుల కారణంగా దోమలు విపరీతంగా పెరిగిపోతున్నాయని వాటిని అరికట్టేందుకు పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సర్పంచ్ వాసంశెట్టి రేవతి, వైఎస్సార్ సీపీ నాయకుడు వాసంశెట్టి పెదబాబు అన్నారు. వక్కలంకలో దోమలు ప్రబలకుండా ఎబేట్ మందును బుధవారం పిచికారీ చేయించారు. నివాస ప్రాంతాల్లో చెత్త లేకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు.

నూకాంబిక అమ్మవారికి గ్రామోత్సవం

ఆలమూరు: మండలంలోని సందిపూడిలో నూకాంబిక అమ్మవారికి బుధవారం వైభవంగా గ్రామోత్సవం జరిగింది. చింతలూరు గ్రామదేవత నూకాంబిక అమ్మవారు చర్మ వాయిద్యాల నడుమ బుట్టగరగ రూపంలో రెండో రోజు గ్రామంలో ఇంటింటికీ దర్శనమిచ్చింది. బుట్టగరగను నెత్తిన ధరించిన ఆలయ అర్చకుల పాదాలను మహిళ భక్తులు పసుపు నీళ్లతో కడిగి నూతన వస్త్రాలు, పసుపు, కుంకుమలను అందజేశారు. మొక్కులు తీర్చుకుని హారతులు ఇచ్చి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

కళాకారులకు పింఛన్లు అందించాలి

మామిడికుదురు: 50 ఏళ్ల నిండిన రంగస్థల వృత్తి కళాకారులకు పింఛన్లు అందించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరుతూ స్థానికంగా బుధవారం జరిగిన కోనసీమ వృత్తి కళాకారుల సాంస్కృతిక సంక్షేమ సంఘం సమావేశం తీర్మానం చేసింది. స్థానిక అంబేడ్కర్ సామాజిక భవనంలో జరిగిన సమావేశానికి వ్యవస్థాపక అధ్యక్షుడు మంగం సత్యనారాయణ అధ్యక్షత వహించారు. సంఘం కార్యకలాపాలకు స్థలం మంజూరు చేసి భవన నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని తీర్మానించారు. సమావేశంలో ప్రధాన కార్యదర్శి వాసంశెట్టి శంకరరావు, ఉపాధ్యక్షుడు అడబాల సత్యనారాయణమూర్తి పాల్గొన్నారు.

ఆనందోత్సాహాలతో బీబీ జైనబ్ జయంతి

మామిడికుదురు: ముస్లింల మొదటి ప్రవక్త ఇమామ్ హాజరత్ అలీ తనయ బీబీ జైనబ్ జయంతిని బుధవారం ఆనందోత్సాహాలతో నిర్వహించారు. దీనిలో భాగంగా నగరం మంజిలే కర్బలాలో కవి సమ్మేళనం, మిలాద్ జరిగింది. ఖాసిం మహ్మద్ రజా (రజ్వీ) ఆధ్వర్యంలో మిలాద్ ఏర్పాటు చేశారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు మిలాద్‌లో పాల్గొన్నారు.

సంక్షేమమే ప్రభుత్వ అజెండా


గ్రామ కన్వీనర్లకు ప్రచార కిట్ అందిస్తున్న ఎమ్మెల్యే రాపాక

రాజోలు: సంక్షేమమే ప్రభుత్వ అజెండాగా రాష్ట్రంలో పాలన జరుగుతోందని ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు అన్నారు. బుధవారం రాజోలు, కడలి గ్రామాల్లో రాజోలు మండలంలోని గ్రామ కన్వీనర్లు, గృహ సారథులతో మండల స్థాయి శిక్షణ, అవగాహన సదస్సు నిర్వహించారు. ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ పార్టీ అందిస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజలకు వివరించేందుకు గ్రామ కన్వీనర్లు, గృహసారథులు కీలకభూమిక పోషించాలన్నారు. పార్టీ చేపట్టే అన్ని సంక్షేమ పథకాలు అర్హులకు అందించే బాధ్యత వీరిపై ఉందన్నారు. బాధ్యతలకు చేపట్టిన గ్రామ కన్వీనర్లకు ప్రచార కిట్లను అందజేశారు. రాజోలు రోటరీ క్లబ్ కార్యాలయం వద్ద శివకోటి, రాజోలు, బి.సావరం, పొదలాడ, చింతలపల్లి, ములికిపల్లి, కూనవరం, సోంపల్లి గ్రామాల కన్వీనర్లు, గృహసారథులు, కడలి పంచాయతీ వద్ద నిర్వహించిన శిక్షణలో కడలి, వేగివారిపాలెం, చెన్నడం, పొన్నమండ వంటి పలు గ్రామ కన్వీనర్లు, గృహసారథులు పాల్గొన్నారు. జెడ్పీటీసీ మట్టా శైలజ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ అభ్యర్థుల ఎంపికపై కాపు నేతల హర్షం

మామిడికుదురు: కోనసీమ జిల్లా శెట్టిబలిజ వర్గం నుంచి కుడుపూడి సూర్యనారాయణరావు, మాదిగ కులానికి చెందిన బొమ్మి ఇజ్రాయిల్‌ను ఎమ్మెల్సీ అభ్యర్థులుగా వైఎస్సార్ సీపీ ప్రకటించడంపై పార్టీకి చెందిన కాపు నేతలు హర్షం తెలిపారు. స్థానికంగా బుధవారం జరిగిన సమావేశంలో పార్టీ లీగల్ సెల్ ప్రధాన కార్యదర్శి మంగెన సింహాద్రి, ఎంపీపీ వీర మల్లిబాబు, పార్టీ నేతలు రావి ఆంజనేయులు, అడబాల బ్రహ్మాజీ, బొలిశెట్టి భగవాన్, సూరిశెట్టి బాబి మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా సామాజిక న్యాయం పాటిస్తూ అన్ని వర్గాలకు ప్రాతినిథ్యం కల్పించిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. సమావేశంలో బండారు కాశీ, కూనపరెడ్డి రాంబాబు, కుంపట్ల చిన్నారి తదితరులు పాల్గొన్నారు.

లక్ష తమలపాకుల పూజ

మామిడికుదురు: అప్పనపల్లిలో వేంచేసిన అభయాంజనేయస్వామి 12వ వార్షికోత్సవం సందర్భంగా బుధవారం పలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం గణపతి పూజ, పుణ్యాహవాచనం, పంచగవ్యం, గణపతి హోమం, తదితర పూజలతో పాటు లక్ష తమలపాకులతో అర్చన జరిపించారు. ఏకాహానికి కంకిపాటి నరసింహారావు, దుర్గ దంపతులు కలశస్థాపన చేశారు.

ఆరోగ్యంపై అశ్రద్ధ వద్దు

అంబాజీపేట: ప్రతి విద్యార్థి ఆరోగ్యంపై నిర్లక్ష్యం వ్యవహరించకుండా తల్లిదండ్రులకు చెప్పి వైద్యపరీక్షలు చేయించుకోవాలని బైర్రా జు ఫౌండేషన్ కన్వీనర్ ఎల్‌ఆర్‌కె మూర్తి, కో కన్వీనర్ ఐ.ఏడుకొండలు అన్నారు. చిరతపూడిలో ప్రాథమిక పాఠశాలలో వంద మంది విద్యార్థులకు బుధవారం ఉచిత వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు.

నెలరోజుల్లో డంపింగ్ యార్డు నిర్మిస్తాం


మాచవరంలో సంపద కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీపీఓ కృష్ణకుమారి


అంబాజీపేట: ఏళ్ల తరబడి నెలకొన్న డంపింగ్ సమస్యను నెలరోజుల్లో పరిష్కరించి డంపింగ్ యార్డును నిర్మిస్తామని డీపీఓ ఎం.కృష్ణకుమారి అన్నారు. మాచవరం పంచాయతీ పరిధిలోని హడ్కోకాలనీ, మాచవరంలో ఉన్న డంపింగ్ యార్డులను బుధవారం పరిశీలించారు. డీపీఓ మాట్లాడుతూ హడ్కోకాలనీ శివారు స్మశాన వాటికలో చెత్తతో పాటు వ్యర్థాలను పడవేయడం వల్ల దుర్వాసన వెదజల్లి, రోగాల బారిన పడుతున్నామని స్పందనలో ఫిర్యాదు చేశారన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు డంపింగ్ యార్డును పరిశీలించి సమస్యను పరిష్కరించేలా గ్రామస్తులతో చర్చించామన్నారు. మాచవరంలో నిర్మించిన చెత్త నుంచి సంపద సేకరణ కేంద్రం నిరుపయోగం మారిందని దానిని పంచాయతీ అధికారులు, పాలక వర్గం పట్టించుకోకుండా వదిలేశారన్నారు. తడి, పొడి చెత్తలను వేరే చేసి యార్డులో ఉంచేలా మరిన్ని గోశాలు నిర్మించాల్సి ఉందన్నారు. డంపింగ్ యార్డు నిర్మాణానికి కావాల్సిన 15 సెంట్ల ప్రభుత్వ స్థలాన్ని చూడాలని ఇన్‌చార్జి తహసీల్దార్ రియాజ్ హుస్సేన్‌ను చెప్పారు. అనుకూలమైన స్థలం ఏర్పడే వరకూ కాలనీలో శివారు శ్మశాన వాటికలో రెండు, మాచవరంలో రెండు ట్రాక్టర్‌ల చెత్తను వేస్తారని అందుకు ప్రజలు సహకరించాలని డీపీఓ కోరారు. దాంతో ఇరువురు అంగీకరించి నెల రోజుల్లోగా డంపింగ్ యార్డును నిర్మించి కాలనీల్లో ఎటువంటి ఇబ్బందులు లేకుండా పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ బి.మమత, ఆర్‌ఐ ఎండీ.ఇబ్రహీం, స్థానిక నాయకులు నాగాబత్తుల సుబ్బారావు, ఉందుర్తి నాగబాబు, శిరిగినీడి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

దాతల సహకారం మరువరానిది


ఉన్నత పాఠశాల అదనపు భవనాన్ని ప్రారంభిస్తున్న డీఈఓ కమలకుమారి

మామిడికుదురు: విద్యారంగం అభివృద్ధికి దాతలు అందిస్తున్న సహకారం మరువరానిదని డీఈఓ ఎం.కమలకుమారి పేర్కొన్నారు. ఆదుర్రులో రిటైర్డ్ ఏఎస్పీ ఐఎల్ నారాయణ స్మారకార్థం ఆయన సతీమణి ఐ.గిరిజాదేవి రూ.40 లక్షలతో నిర్మించిన ఉన్నత పాఠశాల అదనపు గదులను డీఈఓ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆరు గదులతో ఆహ్లాదకరమైన వాతావరణంలో సువిశాలంగా ఈ భవనం నిర్మించారని డీఈఓ పేర్కొన్నారు. ఆదుర్రులో పాఠశాలల అభివృద్ధికి దాతలు ఎంతో సహకారం అందిస్తున్నారని చెప్పారు. దాతలు అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ సీహెచ్ నాగలక్ష్మమ్మ, ఎంఈఓ కోన హెలీనా, పాఠశాల హెచ్‌ఎం ఎస్.శ్రీదేవి, పీఎంసీ చైర్మన్ నాగాబత్తుల శ్రీకృష్ణ, జెడ్పీటీసీ కశిరెడ్డి ఆంజనేయులు, సర్పంచ్ బళ్ల శ్రీనివాసరావు, ఎంపీటీసీ గెద్దం మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఉచిత దంత, కంటి వైద్య శిబిరం


కొత్తపేటలో కంటి వైద్య శిబిరాన్ని పర్యవేక్షిస్తున్న సంఘ నాయకులు

కొత్తపేట: స్థానిక తాలూకా ప్రభుత్వ పెన్షనర్ల సంఘ భవనంలో బుధవారం ఉచిత దంత, కంటి వైద్య శిబిరం నిర్వహించారు. సంఘ అధ్యక్షుడు ఏడిద సత్తిరాజు శిబిరాన్ని ప్రారంభించారు. రాజమహేంద్రవరం అకీరా ఐ హాస్పిటల్ వారి సౌజన్యంతో నిర్వహించిన కంటి వైద్య శిబిరంలో ఆప్తమాలజిస్ట్ ఎం.సాయికిరణ్, టెక్నీషియన్ సురేష్‌బాబు సుమారు 60 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. వారిలో 10 మందికి కంటి శుక్లాల ఆపరేషన్ చేయాలని గుర్తించారు. ఆస్పత్రికి వస్తే ఉచితంగా ఆపరేషన్ చేస్తామని డాక్టర్ తెలిపారు. అమలాపురం ఆయుష్ డెంటల్ కేర్ అండ్ ఇంప్లాంట్ సెంటర్ వారి సౌజన్యంతో నిర్వహించిన దంత వైద్య శిబిరంలో డెంటిస్ట్‌లు ఆనంద్, దుర్గాణి సుమారు 40 మందికి దంత పరీక్షలు చేశారు. వారిలో 8 మందికి రూట్‌కెనాల్ చేయాలని, 12 మందికి కొత్త పళ్లసెట్లు కట్టాలని గుర్తించారు. తమ వైద్యశాలకు వస్తే ఉచితంగా ఆయా ప్రక్రియలు చేస్తామని వారు తెలిపారు. శిబిరానికి వచ్చిన వారికి ఉచితంగా పేస్ట్ ప్యాక్స్, ఐ డ్రాప్స్ అందజేశారు. కార్యక్రమంలో ఆయా వైద్య శాలల పీఆర్‌ఓ, మేనేజర్స్ వెంకటేష్, కె.శ్యామ్, సంఘ జిల్లా, తాలూకా సంఘం కార్యవర్గాల ప్రతినిధులు కాశి రాజేంద్రప్రసాద్, యర్రంశెట్టి చినరామన్న తదితరులు పాల్గొన్నారు.

ఓపెన్ ఇంటర్‌లో ప్రవేశానికి అవకాశం

కొత్తపేట/మలికిపురం/ఆలమూరు: పదో తరగతి పాసైన తరువాత ఇంటర్మీడియెట్‌లో చేరకుండా లేదా మధ్యలో మానేసిన విద్యార్థులకు ప్రభుత్వం ఇంటర్మీడియెట్ చదువుకునే అవకాశం కల్పిస్తున్నట్టు స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఏవీఎస్ బాలాజీ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియెట్ ఆంధ్రప్రదేశ్ ఓపెన్ స్కూల్ సొసైటీ (ఏపీఓఎస్‌ఎస్) ద్వారా చదువుకునేందుకు ఓపెన్ స్కూల్ ఇంటర్మీడియెట్ ప్రథమ సంవత్సరంలో చేరి చదువును కొనసాగించే అవకాశం కల్పించిందన్నారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ బాలాజీ సూచించారు. అలాగే మలికిపురం మండలంలోని కేశనపల్లి జూనియర్ కళాశాలలో ఓపెన్ ఇంటర్మీడియెట్‌లో ప్రవేశాలకు దరఖాస్తులు తీసుకుంటున్నట్లు ప్రిన్సిపాల్ పి.విక్టర్‌బాబు తెలిపారు. అలాగే ఆలమూరు జూనియర్ కళాశాలలోనూ అర్హులైన విద్యార్థులు ఈనెల 26 లోపు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ ఎస్‌వీ ప్రసాదరెడ్డి కోరారు.